# అంతిమం

## కాసుల ప్రతాపరెడ్డి



**"జీవితం ఏమంత మధురంగా ఉండదు" అని అతడు అనుకోవడం ఇది ఏ వందోసారో. "ఎలా వుంటుంది?" అని ఎదురుప్రశ్నను సమాధానంగా ఇచ్చుకోవడం కూడా అన్ని సార్లూ అనుకున్నాడు. ఎంత అనుకుంటే ఏం లాభం? ఏమనుకుంటే ఏం ప్రయోజనం? చదువుతున్న పుస్తకం పక్కన పడేసి కళ్లు నులుముకున్నాడు. రెండు అరచేతులతో ముఖాన్ని కప్పుకుని తుడుచుకున్నాడు. ముఖమంతా జిడ్డు పట్టినట్లు ఉంది. ఈ జిడ్డు భరించలేకనే స్నానం చేశాడు. అయినా వదలడం లేదు. ఎన్నేళ్ల జిడ్డు ఇది? ఎప్పుడు అంటింది? అది అలా ఎంతకాలం ఉంటుంది? జీవితాంతం అదే వదిలేట్లు కనిపించడం లేదు. ఆ జిడ్డు ఒంటికి పట్టిందో, హృదయానికి పట్టిందో అర్థం కావడం లేదు. ఒంటికి పట్టిన జిడ్డయితే వదిలించుకోవడం సులభమే. గుండెకు పట్టింది కాబట్టే వదలడం లేదనిపించింది.**

వెనక్కి వెనక్కి పోతూ కన్నీళ్లను తోడుకోవడం నిత్యకృత్యమైంది.

నొప్పిగా అనిపించి గుండె మీద అరచేతితో రాసుకున్నాడు. ఈ మధ్య గుండె నొప్పి అనిపిస్తూ ఉంది. హార్ట్ ఎటాక్ కావచ్చునని అనిపిస్తూ వుంటుంది. డాక్టర్‌తో చెక్ చేయించుకుంటే మంచిదేమో! డాక్టర్ వద్దకు ఏం వెళ్తాం? కళ్యాణ్‌ను అడిగితే ఏమంటాడు? నవ్వి 'నీకు హార్ట్ ఎటాక్ ఎందుకొస్తుంది?' అంటాడా? ఇదివరకోసారి అంటే నవ్వులాటకంటున్నాడేమోనని అతను సీరియస్‌గా తీసుకోలేదు. ఏ జబ్బు వచ్చినా కళ్యాణ్ వద్దకు వెళ్లడం అలవాటైంది. ఇంతవరకు సీరియస్ జబ్బులేం రాలేదు. తరచుగా విపరీతమైన తలనొప్పి రావడం మామూలైంది. జలుబు చేస్తూ ఉంటుంది. పూర్తిగా తట్టుకోలేనని అనుకున్నప్పుడే అతను కళ్యాణ్ వద్దకు వెళ్తుంటాడు.

సిగరెట్టు తీసి అంటించాడు. సిగరెట్టు దమ్ము లాగుతుంటే ఇంతకుముందటి మజా ఉండడం లేదు. మనసుకు ఆనందాన్నిచ్చేదేదో కావాలని అనిపిస్తూ వుంటుంది. ఏమిటది? అర్థం కాదు. ప్రతిదానికీ ఇతరులను తప్పు పట్టడం కూడా అలవాటుగా మారినట్లు ఉంది. చీటికి మాటికి చిరాకు. బీపీ పెరిగిందేమో చూడమని అడిగాడు ఓ రోజు కళ్యాణ్‌ను. అతను సీరియస్‌గానే చూసి "బీపీ లేదు, ఏం లేదు. నీకు ఏ జబ్బూ లేదు" అని తేల్చి పారేశాడు. అప్పటినుంచి హార్ట్ ఎటాక్ గురించి అడుగుదామంటే జంకుగా ఉంటోంది.

కథ

"ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లు ఉంటారు?" అని అడిగిందోసారి మీనాక్షి.

అతను నవ్వి ఊరుకున్నాడు. యుద్ధాలు బయటే కాదు, లోపలా జరుగుతుంటాయని చెప్పాలనిపించింది. కానీ చెప్పలేదు. నవ్వి ఊరుకున్నాడు.

"విచారంగా ఉన్నట్లు కనిపించడం ఫ్యాషనా? మేధావి లక్షణమా?" అని అడిగింది.

ఇదేదో తనను తాను వేసుకున్న ప్రశ్నలాగా అనిపించింది. బాధలున్నాయని అనుకోవడం ఈ రోజుల్లో ఫ్యాషన్ కావచ్చు. దేనికోసమో దేవులాడుతున్నట్లు కనిపించడం మేధావుల లక్షణం కాబోలు!

జీవితం నిండా ముసురుకున్న చీకట్లు. ఇలా అనుకుంటే ఏదో తృప్తి. ఏ బాధా లేదనుకుంటే ఏదో వెలితి. ఈ వెలితి దూరమైందంటే జీవితంలో మిగిలేదేమిటి?

"కాపురాలు ఎలా చేయగలుగుతున్నారు ఈ మనుషులు?" అని అడిగాడు శ్రీరామ్ ఓసారి.

నువ్వు కాపురం ఎలా చేయగలుగుతున్నావని అడగలేక జనరలైజ్ చేసి అడిగినట్లు అనిపించింది. అప్పటికప్పుడు ఏదో సమాధానం చెప్పాడు కానీ తనను తానే సంతృప్తి పరచుకోలేకపోయాడు.

శ్రీరామ్ పెళ్లి చేసుకొని ఇద్దరు పిల్లలను కని భార్యకు విడాకులిచ్చి ఒంటరిగా జీవిస్తున్నాడు ఇప్పుడు.

"నీకు బిడ్డల మీద మనసు గుంజదా?" అని అడిగాడు అతను ఓసారి శ్రీరామ్‌ను.

"లేదు" అని జవాబిచ్చాడు శ్రీరామ్. శ్రీరామ్ అబద్ధమాడుతున్నాడనిపించింది. బట్టలు మార్చుకొని ఇంట్లోంచి బయటపడ్డాడు. ఎటు వెళ్లాలనేది నిర్ణయించుకోలేదు. ఆఫీసులో పని చేస్తున్నంతసేపూ ఈ పీడ ఎప్పుడు విరగడవుతుందా అన్నట్లుంటుంది. సెలవు దొరికితే పొద్దు పోవడం కష్టమనిపిస్తుంది. ఇదివరకు ఇట్లా ఉండేది కాదు. జీవితం తీరిక లేకుండా సాగుతూ పోయేది. చేయడానికి పనులు ఎన్నో ఉండేవి.

ఎవరి దగ్గరకైనా వెళ్దామా అనుకున్నాడు. ఎవరి వద్దకు వెళ్లాలో తోచలేదు. రామస్వామి వద్దకు వెళ్తే అనిపించింది. అదో చిరాకు! ఎంతసేపు వాడి గొడవే తప్ప ఎదుటివాళ్ల గొడవ పట్టదు వాడికి.

“మీకేంది పెళ్లాలున్నారు. రాత్రయితే చాలు పక్కలో చేరిపోతారు” అన్నాడు ఓరోజు. వాడి బాధేమిటో అర్థం కాలేదు. పెళ్లి చేసుకుంటే వాడికీ అది దొరుకుతుంది కదా అనిపించింది.

“నువ్వూ పెళ్లి చేసుకోరాదు ఆ సుఖమేదో నీకూ ఉంటుంది” అన్నాడు.


“ఆ గానుగెద్దు బతుకు నాకొద్దులే” అన్నాడు రామస్వామి వెంటనే. వాడు ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఊళ్లు తిరుగుతుంటాడు. ప్రసంగాలు చేస్తుంటాడు. అవసరమైతే స్టేజీమీద ప్రదర్శనలిస్తుంటాడు. అది తప్ప మరోటి చేయడు. జీవితం ఎలా గడుస్తుందో ఎప్పుడూ చెప్పడు. ఏమైనా అంటే “మీకేంది ఉద్యోగం, ఇల్లు, పెళ్లాం, పిల్లలు” అంటాడు.

వాడు తన జీవితాన్ని అసహ్యించుకుంటున్నాడో, ఇష్టపడుతున్నాడో అర్థం కాదు.

“అరే రామూ! నీకు మీ తల్లిదండ్రులు ఎందుకా పేరు పెట్టారో కానీ రాముడు మంచి బాలుడు అన్నట్లే ఉంటావురా!” అన్నాడు మరోసారి. ఆ మాట ఎందుకన్నాడో అర్థం కాలేదు రామూకి.

“నీకు ఒకరి మీద పడి ఏడ్వటం తప్ప మరోటి తెలియదా?” అని అడిగాడు రాము.

వాడు పకపకా నవ్వేసి గడ్డం దువ్వుకున్నాడు.



ఎటు వెళ్లాలో తేల్చుకోకుండానే బైక్ మాత్రం ట్రాఫిక్‌ను ఛేదించుకుంటూ హైదరాబాద్ రోడ్డు మీద పరుగులు తీస్తోంది. ఎంత ప్రయత్నించినప్పటికీ ఏదో ఒకచోట ఎవడో ఒకడు ఢీకొడుతూనే ఉంటాడు. చౌరస్తా దాటుతుంటే పక్క నుంచి వచ్చి ఒకడు గుద్దేశాడు. ఎర్ర లైట్ వెలుగుతున్నా వాడు ఆగలేదు. ఏమీ అనడానికి ఉండదు. ఏమైనా అంటే రోడ్డు మీద కయ్యం పెట్టుకోవాలి. లేదంటే వాడితో కుస్తీ పట్టాలి. ఈ రెండూ రాము వల్ల కానివి. ఏమీ అనకుండా వెళ్లిపోయాడు.



అలా వెళ్లీ వెళ్లీ బుక్ షాపు ముందు ఆగాడు. స్టాండేసి లోనికి అడుగుపెట్టి ఇటీవల వచ్చిన కొత్త పుస్తకాల కోసం చూడసాగాడు. నాలుగైదు కవితల పుస్తకాలు, గ్లోబలైజేషన్ మీద ఓ పుస్తకం, ఎడారి యవ్వనం అనే కథల పుస్తకం కనిపించాయి. పుస్తకం తెరవకుండానే అందులోని విషయ మేమిటో తెలిసిపోవడమంత బాధాకరమైన విషయం మరొకటి ఉండదు. ఏదీ కొనాలనిపించలేదు. ఇదివరకు అలా ఉం డేది కాదు.

విశ్వాసాలు సడలిపోతున్నకొద్దీ ఒంటరితనం పెరుగుతూ పోతోంది. అంతర్యుద్ధం ఒకవైపు నడుస్తూ ఉంటే అవతలి నుంచి తాకిడికి పెరుగుతూ వుంటుంది. తనలో తాను సంభాషించుకునే క్రమంలో బాణాలు వచ్చి తగులుతూ ఉంటాయి. అప్పుడు యుద్ధం తన మీద తాను చేయాలో అవతలివాళ్లను ఎదుర్కోవడానికి చేయాలో అర్థం కాదు.

ఇప్పుడేదైనా పుస్తకం చేతిలోకి తీసుకోవాల్సి వస్తే అది రచయిత ప్రోద్బలం మీద అయి వుంటుందే తప్ప ఇష్టం కొద్దీ కాదు. దీనికన్నా నరకం మరోటి ఉండదేమోనని అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది. కాలేజీ రోజుల్లో పుస్తకాల షాపుల వెంబడి, లైబ్రరీల వెంబడి పడి ఆబగా పుస్తకాలు చదవడం గుర్తొస్తే కన్నీళ్లొస్తాయి. ఆ దాహం మళ్లీ పుడుతుందా? దాహంలేని జీవనం ఎంత నరకం అని అనుకున్నాడు రాము.

ఏం చేయాలో తోచడం లేదు. ఏదైనా బార్‌లో దూరిపోతే... అదీ ఆనందాన్ని ఇవ్వడం లేదు. ఒంటరితనం పీడిస్తూ వుంటే దిక్కుతోచని స్థితి రాముది. విశ్వాసాలు సడలిపోతున్నకొద్దీ ఒంటరితనం పెరుగుతూ పోతోంది. అంతర్యుద్ధం ఒకవైపు నడుస్తూ ఉంటే అవతలి నుంచి తాకిడికి పెరుగుతూ వుంటుంది. తనలో తాను సంభాషించుకునే క్రమంలో బాణాలు వచ్చి తగులుతూ ఉంటాయి. అప్పుడు యుద్ధం తన మీద తాను చేయాలో అవతలివాళ్లను ఎదుర్కోవడానికి చేయాలో అర్థం కాదు. అవతలివాళ్లను ఎదుర్కొనే క్రమంలో మనల్ని మనం కోల్పోతూ ఉంటామని రాముకు తెలుసు. అయినా అప్పుడప్పుడు అనుకోకుండానే ఆ పద్మవ్యూహంలో పడిపోవడం తనకు అలవాటైందని అనుకున్నాడు.

ఇప్పటికీ అమ్మ అంటూనే ఉంటుంది- ఈ లోకంలో ఎలా బతుకుతాడోనని. నిజానికి పురిటిలోనే సంధి కొట్టి పోవాల్సింది, లేదంటే ఐదారేళ్ల ప్రాయంలో వచ్చిన నాగుపామేదో పడగ విప్పి ముందు ఆడకుండా కాటేసి వుంటే అయిపోయేది. ఈ జీవితం ఉండేది కాదు. ఈ నరకయాతనా ఉండేదికాదు. అప్పుడు తానేమయ్యేవాడు. ఏమీ కాకుండా పోయేవాడు కదా! మీనాను ప్రేమించి ఉండేవాడు కాదు, లక్ష్మిని పెళ్లాడి వుండేవాడు కాదు. ఇన్ని కవితలు, కథలు రాసి వుండేవాడు కాదు. ఈ బాధంతా లేకుంటే తాను లేనట్లే కదా!

కార్యకారణాలు వెతక్కుండానే జీవితాన్ని ఉన్నదున్నట్లుగా స్వీకరించడం నేర్చుకోవాలి. ఉన్నదున్నట్లు స్వీకరించడమంటే నిత్యజీవన పోరాటాలు లేకుండా ఎలా వుంటుంది?

ఆలోచనల్లో ఇంటికి వచ్చేశాడు. ఇంటిముందు పెద్ద గుంపు చేరి వుంది. ఎందుకు అంతమంది గుమికూడారో అర్థం కాలేదు. జనాలను చీల్చుకుంటూ వెళ్లాడు. మనిషి శవం. నిండా తెల్ల బట్ట కప్పి ఉంది .“ఏమైంది?” అని అడిగాడు ఒకతన్ని.

“రామూగారు చచ్చిపోయారండి. ఎవరో ఛంపేశారు” అన్నాడతను అతి మామూలుగా. వెనక్కి తిరిగి ఇంట్లోకి వెళ్లా లనుకున్నవాడు ఆసక్తి పెరిగి అందరినీ పక్కకు తోసుకుంటూ లోనికి తొంగి చూశాడు. భార్య, ఇద్దరు పిల్లలు శవం మీద పడి బోరుబోరుమని ఏడుస్తున్నారు.

జనాలను తోసుకుంటూ బయటకు వచ్చి మరొకతన్ని ఏం జరిగిందని అడిగాడు. “రామూగారని, ఓ లెక్చరర్‌ను ఎవరో చంపేశారండి. పాపం చాలా మంచివాడు. గుర్తు పట్టరాకుండా ముఖాన్ని చెక్కేశారు. అతని జేబులో ఉన్న ఆనవాళ్లను బట్టి పోలీసులు గుర్తు పట్టారట. పొద్దున ఎప్పుడో చనిపోతే శవాన్ని ఇప్పుడు అప్పగించారు. అప్పుడెప్పుడో ఉద్యమాలని, పౌరహక్కు లని ఉపన్యాసాలిచ్చేవాడట. తమ వాడ్ని చంపేశారని ప్రతీకారంగా రాము గార్ని కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టి చంపేశారట. మేం ఇక్కడే ఉంటున్నాం గానీ అతనెలా ఉంటాడో కూడా మాకు తెలియదండి. ఉన్నాడో లేడో అన్నట్లు ఉండేవాడు పాపం! అంత మంచివాడిని చంపేశారు” అని అన్నాడా మనిషి. రాము గట్టిగా నిట్టూర్చాడు.

తాను అన్ని బంధాల నుంచి విముక్తి అయినట్లు అనిపించింది రాముకు. ఇక తాను ఉన్నా లేనట్లే. బైక్ స్టార్ట్ చేసి తిరుగుముఖం పట్టాడు. ప్రయాణం ఎటు? వెనక్కి... వెనక్కి... గుర్తింపులేవీ లేని ప్రపంచానికి...

●